# 3
# అదృశ్య రూపాలు

అయిటి మూనింది. మొగులునిండా నల్లమబ్బులు. వాన మీద వాన. నేల తల్లి పచ్చి బాలింతయింది. చెట్టూ చేమ, గడ్డి గాదం, ఆకూ అలం, గుట్టా పుట్టను  తట్టి లేపుతుంది. మట్టి పెల్లలల్ల దాక్కున్న వేర్లకు జీవంబోత్తుంది. ఇత్తనాల్ని తడివేళ్లతో తాకి పురుదు పోత్తుంది.

ఎక్కడి మొక్కలు అక్కడ తల్లి గుండెలకు వేర్లు దించి పప్పుబద్దల్ని నెత్తినెత్తుకుని పైకి లేత్తున్నయి. భూమి పొరల్లో పుట్ట బెదిరినట్టుంది. తల్లి నేల తల్లడిత్తుంది.

నాగటి సాళ్లల్ల ఓ ఆముదం గింజ ఉలుకూపలుకూ లేకుంట ఉంది. నీళ్లు తాగుతలేదు. గాలిపీలుస్తలేదు. బయటకు వత్తలేదు. కండ్లు తెరుస్తలేదు. ఈ హడావుడి తనకేం పట్టనట్టు జీవం లేని దానిలా పడి ఉంది.

నేలతల్లి గింజవైపు ఒకసారి అపురూపంగా చూసింది. ఒడిలోకి తీసుకుని ముద్దాడింది. " లే.....లేవ్వ ! మొలికెత్తేయాల్ల. నిద్రపోవద్దు. యాల్లకు మొలికెత్తాలె. లేకుంటే మురిగి మట్టివైపోతవు. " అన్నది.

" ఎందుకు మొలుకెత్తాలె...?" గదుసుగా అడిగింది గింజ.

తల్లిగుండె దడీలు మంది. క్షణంసేపు వణికి పోయింది. నోటమాట రాలేదు. ఎన్నో మొక్కలు పుట్టినయి. పెరిగినయి. వృక్షాలు వటవృక్షాలయినయి. యుగాలుగడిచినయి. ఏగింజా ఇలా అడుగలేదు. జవాబు కొరకు తడుముకుంది.

" నువ్వు ఉత్పత్తి వస్తువువు. ఒకటికి నాలుగు ఉత్పత్తి చెయ్యాలే. అది నీ ధర్మం. అందుకే

నువ్వు మొలకెత్తాలె." ఇంకేం అడుగుతుందోనని భయం భయంగానే చెప్పింది నేల తల్లి.

"నేను ఎవలకోసం మొలుకెత్తాలె". విరక్తిగా అడిగింది గింజ.

నేల తల్లి గింజవైపు అనుమానంగా చూసింది. లోకం పుట్టనుంది. పెరుగనుంది. పండుటాకులు రాలిపోతయి. పచ్చటాకులు మొలుత్తయి. ఎండిన చెట్టు మొదళ్లు ఇగురెల్లుతయి. అది సృష్టిదర్మం. దానికి విరుద్ధంగా అడుగుతున్న దేమిటి? అనుకుని పైకి మాత్రం. "నిన్ను నమ్ముకున్న రైతుకోసంమొలకెత్తాలే. నట్టింటపుట్టెడు రాశిగా మొలువాలే" అన్నది.

గింజ చిన్నగా నవ్వింది. ఆనవ్వుల జీవంలేదు. "అమ్మా ! నేలతల్లీ....నాపుట్టుక మొదలయిననుంచి నన్ను పుట్టిత్తనే ఉన్నవు. నేను గూడా నాధర్మం ఎన్నడూ మరువలేదు. రైతు ఆకలి తీర్చిన. ఇంట్లో దీపమై మొలిచిన. కూరకు నారకు రుచిని తెచ్చిన. కడుపునొస్తే కాళ్లు గుంజితే మందు చుక్కనై మంచిగ జేసిన. చిన్న పిల్లల మాడకు రాస్తె రక్తంలో రక్తాన్నయి పుర్రెకు బలాన్నిచ్చిన. వాళ్ల నవ్వునూ బతుకును చూసి మళ్ళీ మళ్లీ మొలుకై లేచిన.

ఇప్పుడు నమ్ముకున్న వాడిని నడిమికి ముంచి అమ్ముకున్నవాడి కోసం ఎందుకు మొలకెత్తాలె.....నా ఆలనా పాలనా చూడనివాడు.......నా పుట్టుకనే తెలువనివాడు.... కనీసం నన్ను వేళ్లతోనైనా తడుమనివాడు...వాడి కోసం నేనెందుకు మొలకెత్తాలె....." నిలదీసినట్టుగా అడిగింది గింజ.

నేల తల్లికి కోపమచ్చింది. అదీ కొంతసేపే! వెంటనే శాంతంగా మారిపోయింది. ఆయిటిమూనిన ఆగంలో ఉంది. ఏండ్లనాటి చరిత్రలో కనుమరుగైన విత్తనాల్ని చూసింది. కొత్తకొత్తపంటల్ని చూసింది. ఎప్పుడో ఏగింజనో ఇలా అడుగుతుందని తెలిసినా ఇంత తొందరలోనే అడుగుతుందని మాత్రం అనుకోలేదు. సృష్టికి విరుద్ధమైన ఈ ఆలోచనకు భయమనిపించింది.

అందుకని గింజతో ఎక్కువగా వాదించకుండా నచ్చజెప్పాలని చూసింది. గింజ వినలేదు. మంకు పట్టు ఇడువలేదు. "నేను మొలిత్తే నన్ను పోదనజెయ్యడానికి రైతు మరిన్ని అప్పులు జేత్తడు. ఎండ్రిన్ అంటడు. పురుగు మందంటడు. కలుపుదీత్తడు. మందులేత్తడు. ఈనగాశితొడేళ్లకు పెట్టినట్టు పంటకు పంటను మంది చేతుల పెట్టి అప్పుల పాలైతడు. మొలువకపోతేనైనా ఆ తిప్పలు తప్పుతయి."

ఈ సారి నేలతల్లి పకపక నవ్వింది. "నువ్వు వట్టి పిచ్చిదానివి. మొలువకపోతే మాత్రం ఊకుంటడా.....? వరంగల్‌లో ఏం జరిగిందో తెలువదా.....? కొత్త ఇత్తునాలు దెత్తడు. మొన్నటి ఇత్తునాలు మొలువలేదని దుకాణాల ముందు దర్నా జేత్తడు. కుస్తీవడుతడు..... కేసులంటడు. మొలువకపోతే ఆ తిప్పలు ఇంకా ఎక్కువుంటయి."

వెంటనే అందుకుంది గింజ. "నకిలీ జేసి నన్ను అమ్మినోడు నాశినమైపోని. కొన్నోడే కొన ముట్టనప్పుడు అమ్మినోడు ఏ అడివిల పోతేంది....? ఆగమైతేంది. అమ్మా ! నేను ఉత్పత్తి వస్తువునన్నావు

గదా! అక్కడే తలిగింది దెబ్బ. మార్పిడి వస్తువుగా ఉన్నప్పుడు బాగానే ఉన్నం. వండి వార్చి నూనె తీసినప్పుడు అందరం సుఖంగానే ఉన్నం. ఇంటి నుండి గానుగుకు పోవుడు మొదలయిన్నుండే కష్టాలు మొదలైనయి. గానుగునుండి మిల్లుకు..... మిల్లు నుండి ఆయిల్ కంపినికి...... కల్తీకలుపుకుని రైతులింటికే పాకెట్ల రూపంలో వచ్చినప్పుడు గూడా గుండె చెరువుకాలేదు. " గింజ వణికిపోయింది.

నేల తల్లి గుండె పిండినట్టయింది. క్రాప్ హాలిడే ప్రకటించినంక కన్నీటితో వీడ్కోలు చెప్పిన పొగాకు గింజలు గుర్తుకచ్చినయి. అప్పుడెప్పుడో ఆలుగడ్డ......... ' తల్లీ ! వందుకతినాల్సిన నన్ను నంజుక తింటున్నరని ' చెప్పిన మాటలు గుర్తుకచ్చినయి. టమాటనైతే బ్రెడ్‌మీద జామ్‌నయిననని బెంగటిల్లింది. గోధుమలు బార్లీ గింజలైతే మళ్ళీ పుట్టినిల్లు మొఖమే చూడలేదని, బీరు బ్రాందీలమై ఎక్కడికో పోతున్నామని ఎక్కెక్కి ఏడ్చినయి.

" చూడమ్మా అవసరాలకు తగినట్టుగా మనం మారిపోవాలె. నువ్వు మొలిస్తే వచ్చే నష్టం కంటే మొలువకపోతే వచ్చే నష్టమే ఎక్కువ. దుకాణాలపై దాడి చేసినంక వాళ్లు వదిలిపెడుతరా....? రైతు మీద కేసులు పెట్టి బొక్క బొక్కకు నీళ్లు పోత్తరు. " చెప్పింది నేలతల్లి భయపెట్టిస్తున్నట్టుగా.

ఎందుకోగాని తన సమాధానం తనకే అసహజంగా అనిపించింది. సృష్టి, లయ విన్యాసాలలో ఇరుక్కుపోయినంక జీవం పోయటం తప్ప జీవితాలను చూడడమేమానేసింది. చూసినా కదిలిపోవడం మానేసింది. సంపినోడు, సచ్చినోడు........ అందరూ తన బిడ్డలేనన్న ఓదార్పును తనలోతాను నింపుకోవడం అలువాటయింది.

" అన్నీ..... భరించానమ్మా.... కానీ... ఇప్పుడు..... " మాటలు ఆపి ఏడ్వడం మొదలువెట్టింది గింజ.

వరుదపాటు జాగ. నీళ్లలో తేలుతూ వచ్చిన పల్లి గింజ మట్టితల్లి వేళ్ల మధ్య చిక్కుకొని ఆగిపోయింది. ఇద్దరి మాటలు విన్నది. తన అవస్థకూడా గుర్తొచ్చింది. తల్లి ఒడిలో సేదదీరి బావురుమని ఏడ్వాలనిపించింది.

" ఆ..... ఇప్పుడు... ఏమైంది.....? " నేల తల్లి రెట్టించి అడిగింది.

ఆముదం గింజకంటే ముందే " ఏమైతది.... నాపని కాలేదా...? అదే అయినట్టుంది ...." అందుకుంది పల్లి. ఇద్దరూ వెనక్కి తిరిగి పల్లి వైపు చూసింద్రు.

" ......సగానికి సగం ధర తగ్గించి భారీ సబ్సిడీతో నా ఇత్తనాన్ని మార్కెట్‌కు పంపించారు. ఈ విషయం రైతులకు తెలిసేలోపునే దళారుల చేతుల్లో నల్ల బజారుకెళ్లిన. రెండింతల ధరను పెంచుకుని తెల్లమొకంతో రైతులింటికి చేరిన. రేపు పంటనై పండినంక కూడా ఇంతే ! రైతును ఉద్దరించాలని ఎక్కువ పండుత. కొనుగోలు కేంద్రాల్లో ఎన్నోవంకలు. తక్కువ ధరకే అమ్ముడైపోత. నేను ఇల్లుదాటినంక గానీ ధర పెరుగది...."

" ఆగాగు...." మధ్యలోనే ఆపింది నేలతల్లి. ఆమె భయం ఆమెకుంది. ఇప్పుడు ఎవరి పరిస్థితి

ఏం బాగలేదు. ఈ విషయం విన్నరంటే అందరూ మొండికేత్తరు. సృష్టి ధర్మమే ఆగిపోతుంది. అందుకని బుజ్జగిస్తున్నట్లన్నది.

"చూడమ్మా... ఇత్తునమై పుట్టినంక ఎన్నోబాదలుంటయి. మొలకెత్తుతూ పోవాలెగాని ఇవన్నీ ఆలోచించకూడదు. అయినా ఒకరి విషయంలో ఒకరు కలుగజేసుకోవద్దు..... వెళ్లు." అన్నది పల్లి గింజతో.

పల్లి ముందుకు కదల్లేదు. అక్కడే మట్టిపొరల్లో దాక్కుంది. దాక్కుంటునే ముందున్న గోధుమగింజను తడిమి విషయాన్ని చెప్పింది.

గోధుమ గింజ నేలతల్లివైపు వికారంగా చూసింది. "తల్లీ......బీదా బిక్కీ పొట్టలునింపాల్సినదాన్ని. వాళ్లను ఉపాసముంచి ధనవంతులకు మత్తెక్కిస్తున్న. ఈ పాడు జన్మ ఇంకెన్ని చూడాలెనో..... " విరక్తిగా అన్నది.

నేలతల్లి ఆలోచనల్లో పడింది. ఇక్కడ గనుక చర్చ పెడితే భూమండలమంతా తెలిసిపోతుందనుకుంది. ఈ లోపు ఆముదంగింజ పలిగిపలిగి ఏడ్వడం మొదలు పెట్టింది. గోధుమగింజ పల్లిగింజ ఎటో ఎల్లిపోయినయి. ఆముదాన్ని అక్కడే విడిచి వెళ్లబుద్ధికాలేదు.

తనకు తెలసినంతవరకు ఆముదం ఎక్కడా ఎప్పుడూ ఇట్ల పేచిపడలేదు. నీళ్లను ఇచ్చినా ఇయ్యకపోయినా మొలకెత్తింది. ఎండవానలకోర్చింది. ప్రాసెసింగ్ కొరకు పల్లె నుండి పట్నానికి, పట్నం నుండి ఇతర దేశాలకు కూడా పోయింది. ఎక్కడా నోరు తెరువలేదు. ఇప్పుడే ఇలా అడ్డం తిరిగిందంటే ఏదో బలమైన కారణమే ఉండి ఉంటుందనుకుంది. వెంటనే చేతుల్లోకి తీసుకుంది.

"చూడమ్మా.....నా తల్లివికదూ! ఎప్పుడూ ఇట్ల ఏడువకమ్మా! ఇట్లా మొండికెయ్యద్దు. ఏవస్తువైనా అర్థిక వస్తువైనప్పుడే దానికి విలువ. నీ మట్టుకు నీకు లక్షల మార్కెట్ ఉంది. అదే నీకు విలువ. పుట్టినిల్లు పుట్టినూరని తండ్లాడద్దు. ఎక్కడుంటే అదేమనది. ఎవలదగ్గరుంటే వాళ్లే మన వాల్లు......" చెప్పుకుపోతుంది తల్లినేల.

గింజ ఆ మాటలకు తట్టుకోలేనట్టు చెవులుమూసుకుంది. కన్నీళ్లు మాత్రం ఆగడం లేదు. ఏడుస్తూనే అన్నది. "అమ్మా! నీలెక్క విశాల భావం నాకు లేదు. నేనేమైనా సరే. నన్ను పండించిన రైతు నష్ట పడకుండా ఉంటే చాలనుకున్న. అది కుదురలేదు. కనీసం ప్రాణంతోనైనా ఉంటే చాలనుకున్న. ఇప్పుడు అదిగూడా కుదురదని తెలిసిపోయింది."

మాటల మధ్యలో ఇద్దరికీ చెరుకుగడ్డ ఎదురయింది. పాతవేళ్లతోనే పాణం పోసుకుంటుంది. తల్లిని చూడంగనే పచ్చగా నవ్వింది. మట్టివేళ్లతో వేర్లను తడిమి వెన్ను తట్టింది తల్లి. పిలకలు నిటారుగాలేచి ఆకులు ఇచ్చుకున్నయి.

తనుగూడా ఏదైనా అడుగుతుందేమోనని భయపడిన నేలతల్లి చెరుకుగడ్డ నవ్వేసరికి కుదుటపడింది.

వేర్లను మరోసారి మట్టిపెదవులతో ముద్దాడి ఆముదం గింజతో అన్నది. “చూడు....ప్రపంచంలో ఎవరికీ లేని కష్టాలు ఈ చెరుకు తల్లికున్నయి. చెరుకై పండి బెల్లమై వండిన్నాడు ఎంత సంతోషంగా ఉందో చెక్కరి మిల్లులు మూతపడిన్నాడు కూడా అంతే సంతోషంగా ఉంది. పుట్టుక మాత్రమే నీది. బతుకంతా జనాలదే! సెంటిమెంటుకు పోవద్దు మరి ! ” అన్నది ధైర్యం చెబుతున్నట్టు.

చెరుకుగడ్డ, తల్లినీ ఆముదం గింజను చూసింది. మనుసులోని మర్మం చెప్పుతున్నట్టు మెల్లగా అంది. “ అంతేగాదు. ఇంకో సంగతుంది. అది చెప్పరాదు. వినరాదు. కన్నతల్లి కాబట్టి చెప్పుతున్న. అగ్గిలో అగ్గయి బూడిదలో బూడిదయిండు. తీరా బెల్లం ముద్దలు ఇంటికి వచ్చినంక ధరమొత్తం పడిపోయింది...” చెప్పడం ఆపి ఇద్దరి వైపు చూసింది.

నేలతల్లి మాములుగా వింటుంది. మధ్య మధ్య చేతుల్ని చాపి వేర్లను తడుముతుంది. ఆముదం గింజ మాత్రం ఆసక్తిగా వింటుంది. చెప్పడం మొదలు పెట్టింది చెరుకుగడ్డ.

“...ధర పడిపోగానే మనిషి డీలా పడిపోయిండు. అప్పులు తడిసి మోపెడయినయి. ధర పెరుగుతదేమోనని ఆశపడ్డడు. రోజు రోజుకు తగ్గుడేగని పెరుగుడులేదు. ఇల్లంతా జొబ్బుమని ఈగెలు. కాలు పెడుదామంటే సందులేదు. ఆధరకైనా సరే ! అమ్ముదామనుకున్నడు. అమ్మిండు. అప్పు సగం గూడా తీరలేదు. కొన్నోడు బెల్లాన్ని రైతు ఇంట్లనే ఉంచి కొద్ది కొద్దిగ సారాబట్టీలకు అమ్ముడు మొదలువెట్టిండు.....” మాట్లాడుతుంటే గొంతు వణుకుతుంది. బొంగురువోయింది.

ఈసారి నేలతల్లికూడా కొత్త విషయాన్ని వింటున్నట్టుగా చూస్తున్నది. ఎప్పటికప్పుడు ఏమేం జరుగుతుందో ఏదో ఒక గింజ చెబుతనే ఉంటది. అందుకని విషయాలన్నీ తెలిసిపోతుంటయి. ఈ విషయం మాత్రం ఎవరూ చెప్పలేదు.

“ అయితే ఏం జరిగింది ? ” ఆసక్తిగా అడిగింది తల్లి.

“ పోలీసులు వచ్చి బెల్లాన్ని పట్టుకున్నరు. రైతును అరెస్టు చేసింద్రు. కొన్నోడు తప్పించుకున్నడు. పోలీసులు కేసుపెట్టి సావగొట్టింద్రు.”

‘ ‘ ఓస్....అంతేనా....నేనైతే ఈ పని ఎప్పుడోచూసిన....” ఆముదం గింజ అంటుంటే గడ్డ రోషంగా చూసి “ ......అంతేకాదు బయటకచ్చినంక అప్పుల బాధను మరువడానికి సారకు అలువాటయిండు. తాగి తాగి పేగులు చిల్లులు పడి సచ్చిండు. ఆ సార ఈ బెల్లం నుండి తయారయిందే.....” చెప్పడం ఆపి మౌనంగా ఉండిపోయింది.

“ చూసినవా....ఇంతకంటే గోరం ఇంకేముంటది. నమ్మినోన్ని చంపి అమ్మినోని ఇల్లునింపింది. అయినా గుండె చెదురుతుందా..... నీ లెక్కనే మొలువనంటుందా.... తన ధర్మం తాను చేస్తుంది. ” నేల తల్లి అన్నది సముదాయిస్తున్నట్టు.

ఈసారి ఆముదం గింజ బింకంగా చూసింది. “ నువ్వు ఒక్కసారే చంపినవు. ఒక్కలనే చంపినవు. నేను పిల్లా జెల్లా ముసలీముతకా ఆడా మగా తేడా లేకుండా......తెలువకుండా చంపిన. మందులల్ల

కల్తీ మందునై......నూనెలల్ల కల్తీ నూనెనై వెయిలమందిని రోగాల్తో చంపిన. నన్ను నమ్ముకున్న పేదోళ్లను మరింత కిరాతకంగా చంపి......' బిరుసుగా చెప్పి మరోసారి ఏడ్చింది.

నేలతల్లి అయోమయంగా చూసింది. క్షణంలో సర్దుకుని గింజను నెత్తినెత్తుకుంది. "చిట్టితల్లీ.....నీ కష్టమంతావిన్ననమ్మా ! అయినా మనం చేసేదేముంది. ఎప్పుడో ఒకప్పుడు మంచి రోజులు రాకపోవు. నిన్ను పండించిన వాడి ఆకలి తీర్చక పోవు......." అన్నది.

తల్లి చేతుల్లోనే ఎక్కెక్కిపడి ఏడుస్తుంది గింజ. ఏడుస్తూనే "నేను మొలకెత్తన్నది అందుకు కాదమ్మా ! నష్టమచ్చినా కష్టమచ్చినా పసలు పసలుకు ఇల్లునిండేదాన్ని. కాళ్లల్ల చేతులల్ల మెదిలేదాన్ని. కుంగిపోయిన రూపాల్ని కళ్లనిండా చూసుకునేదాన్ని. నువ్వన్నట్టుగనే ఎప్పుడో ఒకప్పుడు కష్టాలన్నీ తీర్చకపోతనా అనుకునే దాన్ని......కానీ.... నేను పూర్తిగా అమ్ముడుపోయిననమ్మా ! నన్ను పండించడానికే హక్కులేదు. చేత్తో తడుమడానికి హక్కులేదు. చూడడానికి హక్కులేదు. తాకడానిక్కూడా హక్కులేదు......" ఏడుపును అందుకుంది.

ఈ మాటలకు నేల తల్లి తల్లడిల్లిపోయింది. విషయమేమిటో పూర్తిగా అర్థంకాకపోయినా గింజ దూరమై పోతుందన్న భావన కలిగి మరింత గట్టిగా గుండెకు హత్తుకుంది. వెంటనే చెరుకుగడ్డ చెప్పింది.

" నిజమేనమ్మా.....నేనూ సగం అమ్ముడుపోయిన. కక్కుడు బైలుకు, అతిసారకు వాడే ఓరల్ రీ హైడ్రేషన్ చికిత్సపై అమెరికా కంపెనీ పేటెంట్ హక్కులను సంతం చేసుకుంది. ఆముదంలో ఔషధలక్షణాలున్నయని దాన్ని, నల్ల మిరియాలను, బాస్మతీ బియ్యాన్ని ఎప్పుడో సంతం చేసుకున్నరు......నాలుగు రోజులైతే అవి కనిపించకుండా పోతయి. ఈ లక్షణాలున్నయని మనవాళ్లకు ఎప్పుడోతెలుసు. అయినా ఎవరూ నోరు విప్పరు. " అన్నది.

నేలతల్లి ఆముదం గింజను మరింత గట్టిగా గుండెకు అదుముకుంది. మళ్ళీ చూస్తనో చూడనో అన్నట్టుగ ముద్దు పెట్టుకుంది. గుండెపొరల్ని పెకిలించి లోతుగా దాచుకుంది. తల్లి అంత అర్తిగా అదుముకుంటే గింజకు మరింత భయమేసింది.

ఎంత మట్టిపొరల్లో దాక్కున్నా భద్రతలేదు. భూమండలంలో ఎక్కడ దాక్కున్నా భద్రతలేదు. నోరు తెరిచి నేలతల్లి వైపు భయం భయంగా చూసింది. చూస్తూ...చూస్తూ.....

" తల్లీ......నాలాంటి విత్తనాల గతేంటి.......?" అడిగింది ఆముదంగింజ.

నేలతల్లి దగ్గర సమాధానం లేదు.

(అరుణతార. డిసెంబర్ 2003)